నమస్తే తెలంగాణ
కామారెడ్డి
12 | నిజామాబాద్, మంగళవారం 18 మార్చి 2025 | KAMAREDDY

పసుపు రైతును ఆదుకోవాలి..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'మద్దతు'నివ్వాలి
- సిండికేట్ కుట్రదారులపై చర్యలు చేపట్టాలి
- అసెంబ్లీలో మాజీ మంత్రి వేముల
- పసుపు రైతుల ఇబ్బందులను సభ దృష్టికి తీసుకెళ్లిన ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, మార్చి17: పసుపు పండించిన రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సిండికేట్ కుట్రదారులపై చర్యలు తీసుకోవడంతోపాటు పసుపు క్వింటాల్‌కు రూ.15 వేల మద్దతు ధర చెల్లించేలా చూడాలన్నారు. సోమవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో పసుపు రైతుల సమస్యలను ప్రశాంత్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల రైతులు, నిర్మల్ జిల్లాలోని నిర్మల్, ముథోల్, ఖనాపూర్ నియోజకవర్గాల రైతులు, జగిత్యాల జిల్లాలో జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల రైతులు పండించిన పసుపును విక్రయించేందుకు నిజామాబాద్ గంజ్‌కు తీసుకువస్తారన్నారు. ఈ సీజన్ ప్రారంభంలో నిజామాబాద్ మార్కెట్‌లో క్వింటాల్ పసుపు రూ.12 వేలకు అమ్ముడు పోగా, ప్రస్తుతం రూ.8వేలకు పడిపోయిందన్నారు. ఇదే పసుపును మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌కి తీసుకెళ్తే రూ.14 వేల వరకు ధర వస్తున్నదని చెప్పారు. నిజామాబాద్ మార్కెట్‌లో ఖరీదుదారులు సిండికేట్ అయి, అధికారుల సహకారంతో ధరను తగ్గిస్తున్నారని ఆరోపించారు. దళారులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గిస్తున్నందునే ఈమధ్య రాజకీయాలకు అతీతంగా రైతులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారని తెలిపారు. ఒకే రకమైన పసుపునకు నిజామాబాద్‌లో ఒక రేటుకు, సాంగ్లీ మార్కెట్‌లో మరో రేటుకు అమ్ముడుపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి వేముల విజ్ఞప్తి చేశారు. ఈ మధ్యనే పసుపుబోర్డు ఏర్పాటు కావడంతో రైతులు మద్దతు ధర వస్తుందని ఆశించారని, కానీ వారి ఆశలు అడియాశలయ్యాయన్నారు. బీజేపీ వాళ్లు పసుపుబోర్డు ఏర్పాటుతో పాటు రూ.15 వేల మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చారని, కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ మేనిఫెస్టోలో పసుపు రూ.12 వేలకు కొంటామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఖరీదుదారులు సిండికేట్‌గా ఏర్పడి ఆన్‌లైన్‌లో రెండు, మూడు కుప్పలు కొని మిగతావి కొనకపోవడంతో రైతులు చివరకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఈ కారణంగా తీవ్ర నష్టాలకు గురి కావాల్సి వస్తున్నదని వివరించారు. సిండికేట్ వ్యవహారంపై కఠినంగా వ్యవహరించడంతోపాటు సాంగ్లీ మార్కెట్‌లో లభించే ధర నిజామాబాద్ మార్కెట్‌లో కూడా లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం, పసుపుబోర్డుతో మాట్లాడి వాళ్లు చెప్పినట్లుగానే రూ.15 వేల మద్దతు ధర అందేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. అలాగే, కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ.12 వేల మద్దతు ధర చెల్లించాలని, లేదా రైతు తెచ్చిన పసుపు రూ.9 వేలకే అమ్ముడు పోతే అటువంటి వారికి రాష్ట్రప్రభుత్వం రూ.3 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

దగా పడుతున్న పసుపు రైతు

కటాఫ్ ధర ఒప్పందానికి తూట్లు

- మద్దతు ధర కోసం పసుపు రైతుల పాట్లు
- తూతూ మంత్రంగా స్పందిస్తున్న అధికారులు
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- కొమ్ము, మండకు క్వింటా రూ.8వేలలోపే చెల్లింపులు
- సత్ఫాలితాలివ్వని అదనపు కలెక్టర్‌తో చర్చలు
- కలెక్టర్ దృష్టి పెడితేనే చేకూరనున్న ప్రయోజనాలు

నిజామాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పసుపు రైతులను కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు నిండాముంచుతున్నాయి. గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేస్తున్నాయి. పసుపు రైతుల సమస్యలపై యంత్రాంగం తూతూ మంత్రంగా స్పందిస్తున్నది. గిట్టుబాటు ధర లేక కడుపు మండిన పసుపు రైతులు మొన్న మెరుపు ధర్నాకు దిగారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద రోడ్డుపై కూర్చుని మద్దతు ధర కోసం నినదించారు. దీంతో ప్రభుత్వ యంత్రాంగం దిగొచ్చి రైతులతో చర్చలకు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌ను పంపించింది. గంటల కొద్దీ రైతులతో చర్చించిన తర్వాత ట్రేడర్లు, పాలకవర్గం, రైతులు, రైతు సంఘాల ప్రతినిధుల మధ్య ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. కొమ్ము రకం పసుపునకు రూ.9500 క్వింటాకు చెల్లించాలని అంతకు తక్కువగా ఎవ్వరూ కొనుగోలు చేయొద్దని నిర్ణయం తీసుకున్నారు. పసుపు మండకు రూ.8వేలు చెల్లించాలని నిర్ణయించారు. కానీ ఆ నిర్ణయాలు బుట్టదాఖలయ్యాయి. గంటలు గడువక ముందే వ్యాపారులు అత్యాశకు దిగి ఇష్టారీతిన రైతుల నుంచి దోపిడికి రంగం సిద్ధం చేశారు. అదనపు కలెక్టర్ మాటలను గాలికి వదిలేశారు. ఒప్పందానికి తూట్లు పొడిచి క్వింటా పసుపునకు కొమ్ముకు రూ.8వేలు లోపు చెల్లిస్తున్నారు. మండకు చెల్లించే ధరను మరింత తగ్గిస్తున్నారు. కుంటి సాకులు చెప్పి రైతులను నిలువుదోపిడీకి గురి చేస్తున్నారు. ఇదంతా ఏమిటంటూ? రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ వేడుకుంటున్నారు. పసుపు బోర్డు వస్తే పసుపు రైతుకు ఎకరానికి రూ.25వేలు లాభం జరుగుతుందని గొప్పలు చెప్పిన బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇంత వరకూ పత్తా లేకుండా పోయాడు. రైతుల దీనావస్థపై కనీసం స్పందించకపోవడం గమనార్హం.

దయనీయంగా పసుపు రైతు

పసుపు రైతులకు నష్టాలు తప్ప, లాభం లేకుండా పోతున్నది. ఈ ఏడాది సీజన్ ఆరంభం నుంచి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వారిని పట్టించుకునే నాథుడు కరువవ్వడంతో దళారులు దోచుకుంటున్నారు. దళారులకు తెరవెనుక నుంచి ప్రభుత్వ పెద్దలే మద్దతు తెలుపుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. పసుపు రైతుల గోసపై పాలకులకూ పట్టింపు లేకుండా పోయింది. ధరలేని సమయంలో ధైర్యం చెప్పాల్సిన ప్రజా ప్రతినిధులు ఇటువైపే రావడం లేదు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి నియోజకవర్గాల్లో పెద్ద మొత్తంలో పసుపు సాగవుతున్నది. వీరెవ్వరూ పసుపు రైతుల బాధలను ఆలకించడం లేదు. పసుపు రైతుల విషయంలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నేరుగా కలెక్టర్‌కు ఫోన్ చేసి పరిస్థితులపై ఆరా తీశారు. వ్యాపారుల మోసాలపై దృష్టి సారించాలని కోరారు.. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న మోసాలపైనా అసెంబ్లీలో గళం వినిపించారు. ఎమ్మెల్సీ కవిత సైతం ఫిబ్రవరి 22న మార్కెట్ యార్డును సందర్శించి రైతుల పక్షాన నిలబడ్డారు. పోరాటానికి సిద్ధం కావాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల మెరుపు ధర్నాపైనా స్పందించి పసుపు రైతులకు నేనున్నానంటూ భరోసా కల్పించారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు మానవత్వంతో స్పందించి రైతులకు ధైర్యం చెబుతుంటే.. పాలక పక్షాలు మాత్రం కనీసం పట్టించుకోవడం లేదు. పసుపు రైతుల ఆందోళనలు జరుగుతుంటే బీజేపీ ఎంపీ అర్వింద్ కనీసం స్పందించడం లేదు. ఆయనకు పసుపు రైతుల బాధలు మాత్రం కనబడడం లేదు. 2019, 2024లో అబద్ధపు హామీలతో రెండు సార్లు ఎంపీగా గెలిచినా పసుపు రైతుల సంక్షేమాన్ని గాలికివదిలేశాడు. పేరుకు పసుపు బోర్డు ఏర్పాటు చేసినట్లు చెబుతున్నప్పటికీ రైతులకు ఎలాంటి ప్రయోజనమూ లేకుండా పోయిం ది. పసుపు బోర్డు వస్తే రైతుకు ఎకరా పంటకు రూ.25వేలు లాభం వస్తుందని వ్యాఖ్యానించాడు. అదేది రైతులకు కనిపించకపోవడంతో బీజేపీ ఎంపీని ప్రశ్నిస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దగా

పసుపు క్వింటాకు రూ.15వేలు చెల్లిస్తామంటూ గతంలో బీజేపీ ప్రభుత్వం చెప్పింది. బీజేపీ ఎంపీ ఒకడుగు ముందుకేసి పసుపు బోర్డు స్థాపనతో రైతులకు రూ.25వేల వరకు లాభం జరుగుతుందని మాటలు చెప్పి రైతులను ఆకట్టుకున్నాడు. కాంగ్రెస్ పాలకులు సైతం అసెంబ్లీ ఎన్నికల్లో ఇష్టారీతిన హామీలు ఇచ్చారు. క్వింటా పసుపునకు రూ.12వేలు కచ్చితంగా అమలు చేసి చూపిస్తామన్నారు. పీసీసీ చీఫ్ హోదాలో స్వయంగా రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రస్తుతం క్వింటా పసుపునకు రూ.12వేలు అన్నది మచ్చుకూ కనిపించడం లేదు. ఒకరిద్దరు రైతులకు ఈ-నామ్‌లో భారీ ధరలకు పసుపు కొనుగోళ్లు చేసినట్లుగా వ్యవసాయ మార్కెట్ వర్గాలు నమోదు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. గరిష్ఠ, కనిష్ఠ ధరలను ఇష్టారీతిన ఆన్‌లైన్‌లో నమోదు చేసి అమాయకులైన రైతులను ముంచేస్తున్నది. ఇవే ధరలు ఉన్నాయనుకుని రైతులు మార్కెట్‌కు వచ్చే సరికి రూ.8వేలు వరకు క్వింటా పసుపునకు ధర పలుకుతున్నది. ఒకరిద్దరికి వచ్చే లాభాన్ని మిగిలిన వారికి కూడా అంటగట్టి విష ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ రూ.12వేలు మద్దతు ధరను ఇవ్వాల్సి ఉండగా, ఇంత వరకూ ఆ మాటెత్తడం లేదు. రూ.8వేలు నుంచి రూ.10వేలలోపు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన నష్టాన్ని సర్కారే బోనస్‌గా ఇవ్వాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మూడు రోజులకు కొన్నారు..

అధికారులు పసుపు రైతులను పట్టించుకోవడం లేదు. మా పరిస్థితి ఏం కావాలి. నేను మార్కెట్‌కు వచ్చిన మూడు రోజుల తర్వాత నా పంట బీట్ అయ్యింది. అది కూడా చాలా తక్కువ ధరకు కొన్నారు. రూ.8500 నుంచి రూ.9వేలకు పోయింది. నష్టమే తప్ప, లాభం లేదు.

- ముత్యం రెడ్డి, పసుపు రైతు, నికాల్‌పూర్

పసుపు బోర్డు వచ్చి ఏం లాభం లేదు..

పసుపు బోర్డు వస్తే పసుపు ధర ఆశాజనకం గా ఉంటుందని అనుకున్నాం. పసుపు బోర్డు వచ్చినా గిట్టుబాటు ధర రావడం లేదు. ఇప్పుడు మార్కెట్లో రూ. 8వేలు, రూ. 9వేలు చెబుతున్నారు. క్వింటా పసుపునకు రూ.15వేలకుపైగా పంట కొనుగోళ్లు జరిగితేనే లాభం ఉంటుంది. రూ.8వేలతో నష్టమే తప్ప లాభం లేదు.

- సింగిరెడ్డి శేఖర్, పసుపు రైతు, కమ్మర్‌పల్లి

ఇష్టారాజ్యంగా 'ఉపాధి' పనులు

అధికారులకు లీగల్ నోటీసులు

కోటగిరి నాయబ్ తహసీల్దార్‌కు నోటీసు పత్రాన్ని అందజేస్తున్న స్థానిక నాయకులు

కోటగిరి, మార్చి 17: ఉపాధి హామీలో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టిన అధికారులకు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు లీగల్ నోటీసులు జారీ చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించకుండా నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి హామీ పనులకు ఆమోదం తెలిపారు. ఎలాంటి తీర్మానాలూ లేకుండానే నిధులు కేటాయించి పనులు చేపట్టారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాసరావు నిబంధనలు ఉల్లంఘించి పనులు చేపట్టారంటూ హైకోర్టు న్యాయవాది ద్వారా నోటీసులను పంపారు. సదరు నోటీసులను కోటగిరి ఎంపీడీవోతోపాటు తహసీల్దార్, కార్యదర్శికి సోమవారం అందజేసినట్లు కోటగిరి మాజీ ఎంపీటీసీ సలీం, వహీద్ తెలిపారు. పొతంగల్, మోస్రా, చందూర్ వర్ని మండలాల పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతోపాటు పీఆర్ఏఈలకు నోటీసులను పంపినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఆనంద్, జిల్లా కార్యదర్శి వహీద్ సోహెల్, సలీం, నజీర్ తదితరులు ఉన్నారు.

వర్ని మండలంలో దళారులకు ధాన్యం విక్రయిస్తున్న రైతులు

సర్కారు 'మద్దతు' లేక..

ధాన్యం కొనుగోళ్లపై సర్కార్ నిర్లక్ష్యం..రైతులకు తీవ్ర నష్టం చేకూరుస్తున్నది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందో లేదోననే సందిగ్ధంలో ఉన్న రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండలంలో ఇప్పటికే వరి పంట కోతలు షురూ అయ్యాయి. కోసిన ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ. 2,220 వరకు ప్రకటించగా..దళారులు మాత్రం రైతుల నుంచి రూ.1900 కే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరతోపాటు బోనస్ కలిపి రైతుకు రూ.2,750 అందాల్సి ఉండగా..850 నష్టపోవాల్సి వస్తున్నది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

-రుద్రూర్, మార్చి17

మిర్చికి మద్దతు ధర రూ.25 వేలు ప్రకటించాలి

- ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్

ఖలీల్‌వాడి, మార్చి 17 : మిర్చి రైతుల సమస్యలను పరిష్కరించాలని, మిర్చి పంటకు రూ.25వేల మద్దతు ధర కల్పించాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం శాసనమండలి ఆవరణలో మిర్చి దండలతో ప్రదర్శన చేపట్టి మాట్లాడారు. రాష్ట్రంలో గత సీజన్‌లో 4 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగైనట్లు తెలిపారు. ధర లేక ఈ సీజన్‌లో 2 లక్షల 40 వేల ఎకరాల విస్తీర్ణం తగ్గిపోయినట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి మద్దతు ధర క్వింటాలుకు రూ.25 వేలు నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళా వ్యతిరేకి సీఎం రేవంత్‌రెడ్డి

మహిళల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేని ప్రభుత్వం కాంగ్రెస్ సర్కారు అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. మహిళా వ్యతిరేక ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో కూడా సీఎం మహిళల పట్ల దురుసుగా మాట్లాడారని, ఆ రోజును చీకటి రోజుగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవిత పోరాటంతోనే రెండు వేర్వేరు బిల్లులు పెట్టిన ప్రభుత్వం

- తెలంగాణ జాగృతి సాధించిన మరో భారీ విజయం
- విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి

సమావేశంలో మాట్లాడుతున్న జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి

ఖలీల్‌వాడి, మార్చి 17 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాట ఫలితంగానే బీసీలకు రాజకీయ విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచడానికి ప్రభుత్వం రెండు వేర్వేరు బిల్లులను పెట్టిందని జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి స్పష్టం చేశారు. బీసీల కోసం కవిత చేసిన ఉద్యమానికి ప్రభుత్వం తలొగ్గిందని, అందుకు ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు తెలిపారు. ఇది తెలంగాణ జాగృతి సాధించిన మరో భారీ విజయంగా అభివర్ణించారు. అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లులు ప్రవేశపెట్టిన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదీర్ఘకాలంగా దేశంలో అన్ని రకాల అన్యాయాలకు గురైన బీసీలకు విద్యా, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు వేర్వేరు బిల్లులను ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా, ఉపాధి రాజకీయ రిజర్వేషన్లకు కలిపి ఒకే బిల్లు పెడితే బీసీలకు అన్యాయం జరుగుతుందని ముందే గుర్తించి వేర్వేరు బిల్లులు పెట్టాల్సిందేనని డిమాండ్ చేసింది కేవలం జాగృతి అధ్యక్షురాలు కవిత మాత్రమేనని గుర్తు చేశారు. మండల్ కమిషన్ రిపోర్టును తొక్కి పెట్టింది మొదలు కులగణను డెడికేటెడ్ కమిషన్ కాకుండా రెగ్యులర్ కమిషన్‌కు ఇచ్చే వరకు కాంగ్రెస్‌ది ద్రోహచరిత్ర అని పేర్కొన్నారు. సమావేశంలో ఈగ సంతోష్, అర్చన, సేనాపతి, కిశోర్‌యాదవ్, లింగం, ఆనంద్, లలిత యాదవ్, లావణ్య, రాజు, తేజ, సందీప్, వికాస్ పాల్గొన్నారు.

మహిళను కొట్టిన ఘటనలో

బోధన్ రూరల్ సీఐకి చార్జిమెమో

వినాయక్‌నగర్/బోధన్, మార్చి 17: ఓ మహిళను కొట్టిన ఘటనలో బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబుకు నిజామాబాద్ సీపీ సాయిచైతన్య సోమవారం చార్జిమెమో జారీ చేశారు. బాధ్యతలు తీసుకున్న వారంలోపే సిబ్బంది పనితీరుపై ప్రత్యేక దృష్టిసారించిన సీపీ, క్రమశిక్షణ పాటించని వారిపై చర్యలకు ఉపక్రమించారు. ఇందులోభాగంగా బోధన్ రూరల్ సీఐకి చార్జిమెమో జారీ చేయడం గమనార్హం. కొన్ని రోజుల క్రితం ఎడపల్లి మండలం జాన్కంపేట్ శ్రీ లక్ష్మీ నర్సింహా స్వామి ఆలయం వద్ద జరిగిన జాతరలో తన శరీరంపై గాయమయ్యేలా లారీతో సీఐ విజయ్‌బాబు కొట్టినట్లు బోయి భాగ్య అనే మహిళ ఫిర్యాదుచేసింది. ఈ విషయమై ఆమె అప్పటి ఇన్‌చార్జి సీపీతోపాటు బోధన్ ఏసీపీకి ఫిర్యాదుచేసి తన గోడును వెల్లబోసుకున్నది. అయినప్పటికీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదు. ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సీపీ సాయిచైతన్య దృష్టికి సదరు మహిళా ఫిర్యాదు రావడంతో పూర్తిస్థాయిలో విచారణ జరిపించారు. వాస్తవాలు వెలుగు చూడడంతో క్రమశిక్షణలో భాగంగా బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబుకు చార్జిమెమో జారీ చేసినట్లు సీపీ ఒక ప్రకటనలో తెలిపారు.

కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

అంగన్‌వాడీల 48 గంటల మహా ధర్నా

- కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- 'పీఎం శ్రీ', మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేయాలని డిమాండ్

కామారెడ్డి, మార్చి 17 : తమ సమస్యలను పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు ఆందోళన బాట పట్టారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట 48 గంటలపాటు మహా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కల్పన మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారానికి సోమ, మంగళవారాలు రెండు రోజులపాటు అంగన్‌వాడీ కేంద్రాలను బంద్ చేసి, ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఐసీడీఎస్ పథకం ప్రారంభమై 50 ఏండ్లు అవుతున్నా సమసలు పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. ఐసీడీఎస్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం వేతనం రూ. 18 వేలకు పెంచాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.